క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న శాస్త్రవేత్తలు, అధ్యాపకులు

కళ్యాణదుర్గం రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు, ఎస్వీజీఎం డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఎస్వీజీఎం డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హిసేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్, కేవీకే శాస్త్రవేత్తలు బాలాజీ, హరిణి, శిరీష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే ప్రధానం

కళ్యాణదుర్గం: స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. స్థానిక ప్రజా వేదికలో బుధవారం ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, డాక్టర్ రాజేష్ కుమార్, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్నతో కలిసి స్వస్థ్ నారీ...సశక్తి పరివార్ అభియాన్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొని విశ్వ బ్రాహ్మణులకు కమ్యూనిటీ భవనంతోపాటు స్థలం మంజూరు చేస్తామని తెలిపారు.

బ్రహ్మసముద్రం: భైరసముద్రం గ్రామంలో బుధవారం స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ ప్రారంభించారు. డాక్టర్ అబ్బాబ్ , వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాళ్/కణేకల్లు: బొమ్మనహాళ్‌తో పాటు దర్గాహొన్నూరు, అలాగే కణేకల్లులోని గరుడచేడు పీహెచ్‌సీలో బుధవారం స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా దేశాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వైద్యులు రఫీయా సుల్తాన్, శ్రీలక్ష్మీ, గౌరి తెలిపారు.

వజ్రకరూరు: మహిళలు సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండడమే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ లక్ష్య మని సూపరింటెండెంట్ లలిత అన్నారు.బుధవారం మండలంలోని కొనకొండ్ల సీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కూడేరు: ఆహారపు అలవాట్లు , జీవనశైలిలో మార్పులు రావడమే రోగాలు రావాడానికి ప్రధాన కారణమని జిల్లా రాష్ట్రీయ బాలల ఆరోగ్య సురక్ష(ఆర్‌బీఎస్‌కే) కో ఆర్డినేటర్, జిల్లా ఎన్‌సీడీ సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి అన్నారు. బుధవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు స్క్రీనింగ్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు.

గోపులాపురంలో జాతర



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: మండలంలోని గోపులాపురంలో బుధవారం మారెమ్మ జాతర (ఊరిదేవర) ఘనంగా జరిగింది. 18 ఏళ్ల తర్వాత ఊరిదేవర నిర్వహిస్తుండటంతో ఊరంతా పండగ వాతావరణం నెలకొంది. దేవమ్మదేవి, పోలేరమ్మలకు ప్రత్యేక పూజలు జరిపించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

వేరుకుళ్లు నివారణలో జాగ్రత్తలు పాటించాలి



వెలిగొండలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ, రైతులు

ఉరవకొండ రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు సాగులో ఉన్న పంటలకు వేరుకుళ్లు తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, నివారణలో రైతులు మెలుకువలు పాటించాలని ఏఓ రామకృష్ణుడు సూచించారు. బుధవారం వెలిగొండ గ్రామ పరిధిలో 'పొలం పిలుస్తోంది ' కార్యక్రమం నిర్వహించారు.

సస్యరక్షణ, చీడపీడల నివారణపై శిక్షణ

బెళుగుప్ప: రైతులు సాగు చేసిన ఉద్యానపంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సస్యరక్షణ చర్యలు చీడపీడల నివారణపై కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త యుగంధర్, మండల హెచ్ఓ కృష్ణ తేజ తదితరులు రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం మండలంలోని రామసాగరం రైతు సేవా కేంద్రంలో రైతులకు ఉద్యాన పంటల సాగుతో పాటు ప్రభుత్వ సబ్సిడీ పథకాలను వివరించారు.


నడిచేందుకు దారేది?



మొలకాల్మూరు రోడ్డు యూనియన్ బ్యాంకు లైన్‌లో సగం రోడ్డుపై టూవీలర్ల పార్కింగ్

రాయదుర్గంటౌన్: అస్తవ్యస్తమైన ట్రాఫిక్ వ్యవస్థ. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి విచ్చలవిడిగా వాహనాలు, ప్యాసింజర్ ఆటోల పార్కింగ్, చిరు వ్యాపారాల ఆక్రమణలతో రాయదుర్గం పట్టణంలో పాదాచారులు నరకం చూస్తున్నారు. పట్టణంలోని అనంతపురం రహదారి, కణేకల్లు రోడ్డు, వినాయక సర్కిల్ నుంచి బళ్లారి రోడ్డు బొడ్డురాయి వరకు, మొలకాల్మూరు రోడ్డు తేరు బజారు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఏరియా, బాలికోన్నత పాఠశాల, పాత మున్సిపల్ కార్యాలయం, గాంధీ సర్కిల్ ఏరియాల్లో పరిస్థితి భయంకరంగా ఉంది. ఏ ఒక్కచోట కూడా పాదాచారులు నడిచేందుకు ఫుట్‌పాత్ కనిపించడంలేదు. ఇటీవల ఏరియా ఆస్పత్రి, బాలికోన్నత పాఠశాల వద్ద ఇరువైపులా ప్రధాన రహదారిలో ఆక్రమణలపై పోలీసులు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తీసుకున్న చర్యలు మూన్నాళ్లముచ్చటగా మారి మళ్లీ పరిస్థితి యథావిధిగా మారింది.


ఆశాజనకంగా ఆముదం



బ్రాహ్మణపల్లి వద్ద సాగు చేసిన ఆముదం

కూడేరు: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగుకు అదునులో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో మండలంలోని పి.నారాయణపురం, బ్రాహ్మణపల్లి, తిమ్మాపురం, కమ్మూరు, గొటుకూరు, కరుట్లపల్లి, కూడేరు, ముద్దలాపురం, చోళసముద్రం, జయపురం తదితర గ్రామాల్లోని రైతులు సుమారు 5 వేల ఎకరాల్లో ఆముదం పంట సాగు చేశారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు ఆముదం పంట ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉంది. పంటకు ఎలాంటి తెగుళ్లు సోకపోతే దిగుబడి బాగా ఉండి ఆదాయాన్ని పొందుతామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కష్టాలు యథాతథం



రైల్వే అండర్‌పాస్ కింద రోడ్డు కోతకు గురై నిలిచిన వర్షపునీరు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ముత్తరాసి కాలనీ బైపాస్‌లోని అండర్ రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు ధ్వంసమై, వర్షపునీరు నిలుస్తుండటంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో వాహనాలు ఇరుక్కుపోయి తీవ్ర అవస్థలు పడేవారు. స్పందించిన రైల్వేశాఖ అధికారులు ఏడాది క్రితం రోడ్డు మరమ్మతు చేశారు. పనులు నాసిరకంగా చేయడంతో ఏడాది గడవముందే మళ్లీ రోడ్డు పరిస్థితి యథాస్థితికి చేరుకుంది. నీటికి తోడు గుంతలు కూడా పెద్దవిగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక ఆ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి రైల్వే అండర్‌పాస్‌లో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వ బ్రాహ్మణసంఘం నాయకులు

ఉరవకొండ: స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయం నుంచి విరాట్ విశ్వకర్మ భగవానుడి జయంతి ను పురస్కరించుకుని విశ్వకర్మభగవాన్ చిత్రపటంతో పట్టణంలో బుధవారం భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఈశ్వరమ్మ ఆలయంలో ప్రజలకు అన్నదానం నిర్వహించారు. విశ్వ బ్రహ్మణ సంఘం నాయకులు జగదీష్ ఆచారి, కృష్ణచారి గోపి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర, అధ్యాపకులు దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ సంఘం నాయకుల ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన వారు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం విశ్వకర్మ చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. నాయకులు మౌనేష్, మంజునాథ్, గోపాల్, మల్లి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: సకల కళలకు ఆది దేవుడు, విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. రాయదుర్గం విశ్వకర్మ సంఘం, కాళికాంబ దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో కంసలవీధిలో వెలసిన కాళికాంబదేవి ఆలయంలో ఉత్సవాలను జరిపారు. విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం విశ్వకర్మ చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. కార్యక్రమంలో నాయకులు కె.నాగరాజు, తిప్పేస్వామి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ

వజ్రకరూరు: మండలంలోని చిన్నహోతురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా మైదానం ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, అండర్–14, అండర్–19 రగ్బీ పోటీల్లో చిన్నహోతురు విద్యార్థులు ఐదుగురు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, పీడీ ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై న అనిత, శ్రీసూర్య, వైష్ణవి, మల్లి, మురారి కర్నూలు, అనంతపురంలో నిర్వహించే స్టేట్ మీట్‌లో పాల్గొంటారన్నారు.బుధవార పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను తదితరులు అభినందించారు.

428 పశువులకు టీకాలు

గుమ్మఘట్ట: మండలంలోని దేవరెడ్డిపల్లి, రంగసముద్రం గ్రామాల్లో 428 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు పశువైద్యులు నవీన్‌కుమార్ తెలిపారు.

ఘనంగా ఏకాదశి పూజలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణి పాండురంగస్వామికి బుధవారం ఏకాదశి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు ప్రత్యేక జలంతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర , తెలంగాణ రాష్ట్రాల నుంచి తులసి మాలాధారణకు భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. రాత్రి పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

హెచ్ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

ఉరవకొండ: విద్యార్థులు, యువత హెచ్ఐవీ–ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలని కళ్యాణదుర్గం రెడ్స్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మహేష్ సూచించారు. బుధవారం ఆ సంస్థ అధ్వర్యంలో ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంస్థ మేనేజర్ సుఖవ్యాధులు, కండోమ్ ఉపయోగం, ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏఆర్‌టీ మందులు, టోల్‌ఫ్రీ నెంబర్ 1097 గురించి వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌పీ రమేష్, ఎఎన్ఎం వరలక్ష్మి, రీడ్స్ సిబ్బంది షకీలా, రేణుక తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు డబ్బు వాపసు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని టిడ్కో లబ్ధిదారులకు డబ్బు వాపసు ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వంశీ తెలిపారు. ఈమేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టిడ్కో ఇళ్లకు 434 మంది డబ్బు చెల్లించారని, పథకం రద్దయిన నేపథ్యంలో డబ్బు వాపసు ఇస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు డబ్బు చెల్లించిన రసీదులను ఆయా సచివాలయాల్లో ఈనెల25 లోపు సమర్పించాలని సూచించారు.

'పీఎం జీవనజ్యోతి'పై అవగాహన

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో బుధవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి బీమా యోజన పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీజీబీ రీజనల్ కార్యాలయ అధికారి రెడ్డప్ప, మేనేజర్ పెద్దన్న , ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణంరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ హైస్కూల్‌లో కొందరు విద్యార్థులు పాఠశాలకు రాకుండా దుమ్మా కొడుతుండడంతో హైస్కూల్ ఉపాధ్యాయులు వారి ఇళ్లకు వెళ్లి ఆరా తీస్తున్నారు. సక్రమంగా పాఠశాలకు రాకపోతే హాజరు శాతం తగ్గి చదువుతోపాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు దూరం కావాల్సి ఉంటుందని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

శెట్టూరు: చింతర్లపల్లి గ్రామ సచివాలయాన్ని తహసీల్దార్ ఈశ్వరమ్మ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, వారికి కేటాయించిన పనుల రికార్డులను తనిఖీ చేశారు. నూతన రేషన్ కార్డుల పంపిణీపై గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో తిప్పేస్వామి, పంచాయితీ కార్యదర్శి ఫకృద్దీన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా అందరికీ అందిస్తాం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట సొసైటీల్లో యూరియా పంపిణీ జరిగింది. శ్రీధరఘట్ట సొసైటీలో యూరియా పంపిణీ సమయంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఏఓ సాయికుమార్ మాట్లాడుతూ యూరియా అందరికీ అందిస్తామన్నారు. సొసైటీల వద్ద ఎస్ఐ నబీరసూల్ పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములవుదాం



'స్వచ్ఛతాహీ సేవ' ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వాములుకావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని బుధవారం రాయదుర్గం పురపాలక సంఘంలో లాంఛనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మన పరిసరాలు, మన ఊరు శుభ్రంగా ఉంచుకోవాలన్నదే లక్ష్యమన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని వేపులపర్తి క్రాస్ వద్ద వేదావతి హగరి నుంచి అనుమతులు లేకుండా అనధికారికంగా కర్ణాటకకు ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

రాయదుర్గంటౌన్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించాలని ఈఆర్ఓ రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ సమావేశ భవనంలో బుధవారం అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఓటర్ల జాబితా తయారీ, లోటుపాట్లు, చేర్పులు, మార్పులు, ఇతరాత్ర విషయాలపై సమావేశం నిర్వహించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కొండన్న

గుమ్మఘట్ట: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రాయదుర్గం ఎంపీడీఓ కొండన్నకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న రామకృష్ణ జిల్లా కేంద్రంలోని డ్వామా కార్యాలయంలో డీఎల్‌డీఓగా పదోన్నతిపై బదిలీ అయ్యారు.

తల్లిపాలలో పోషకాలు అధికం

కూడేరు: తల్లి పాలలో పోషకాలు అధికంగా ఉంటాయని మండల ఐసీడీఎస్ సూపర్ వైజర్ సురేఖ తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కూడేరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో బుధవారం రాష్ట్రీయ పోషణ మాసంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరంస్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీడీపీఓ ఎల్లమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

దౌర్జన్యపరుల నుంచి కాపాడండి



ఈశ్వరరెడ్డి పొలం వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన దారి

డీ హీరేహాళ్ (రాయదుర్గం): తమ పట్టా భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి పొలాల మధ్య రస్తా ఏర్పాటు చేస్తున్న దౌర్జన్యకారుల నుంచి కాపాడాలంటూ డీ హీరేహాళ్ మండలం మురడికి చెందిన రైతులు బెళుగుప్ప ఈశ్వరరెడ్డి, సరస్వతి, శివారెడ్డి, కాపు అనంతలక్ష్మితో పాటు మరో ఇద్దరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డిని వారు ఆయన నివాసంలో కలుసుకుని జరిగిన అన్యాయంపై వివరించారు. సర్వే నంబర్ 19–బీ లో ఆరుగురు రైతులకు చెందిన 11 ఎకరాలకు పైగా పట్టా పొలం ఉందని, గ్రామ పటం (మ్యాప్) ప్రకారం గతంలో సర్వేయర్ కొలతలు తీసి పొలం గట్టు చివర్లో రస్తా వదిలారన్నారు. అయితే అధికార పార్టీ అండతో తాజాగా కొందరు దౌర్జన్యానికి దిగారని తెలిపారు. పొలం మధ్యలోనే దారి ఏర్పాటు చేశారని, న్యాయం చేయాల్సిన తహసీల్దార్, ఎస్ఐ లాంటి వారి సమక్షంలోనే దారి ఏర్పాటు చేస్తే తమ గోడు ఎవరితో చెప్పుకోవాలంటే ఆవేదన వ్యక్తం చేశారు. విషయం హైకోర్టులో ఉందని త్వరలో స్టే ఆర్డర్ వచ్చే అవకాశం ఉందని, ఈ లోపలే వారు ఇలాంది దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. దీనిపై స్పందించిన మెట్టు .. కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబుకు ఫోన్ ద్వారా జరిగిన విషయాన్ని వివరించారు. గతంలో కూడా తహసీల్దార్ దృష్టికి నేరుగా తానే పలుమార్లు తీసుకెళ్లినా ఇలా బరితెగించడం ఏంటని ప్రశ్నించారు. సత్వరం బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మురడి మురళీమోహన్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతా మోసం, దగా పాలన



8వ వార్డులో కూటమి మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



వేపరాళ్ల గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న సమన్వయకర్త మెట్టు

- రాయదుర్గం వైఎస్సార్‌సీపీ నయన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: 'ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారు. అలాగే అన్నం పెట్టే అన్నదాతలను సైతం నట్టేట ముంచిన చంద్రబాబు కూటమి ప్రభుత్వానిది సూపర్ దగా పాలన' అని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వకర్త మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని 8, 9, 10 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, వార్డు కౌన్సిలర్ చన్నవీరస్వామి, వార్డు ఇన్‌చార్జ్ అరవా శివప్ప, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి వార్డుల్లో పర్యటించిన మెట్టు గోవిందరెడ్డి ప్రజలకు చంద్రబాబు మోసపూరిత పాలనను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, శ్రీలక్ష్మి, శారదాదేవి, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా, రైతు వ్యతిరేక ప్రభుత్వం..

రాష్ట్రంలో ప్రజా, రైతు వ్యతిరేక ప్రభుత్వం కొనసాగుతుందని మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. రాయదుర్గం మండలం వేపరాళ్లలో మండల కన్వీనర్ గొల్ల రామాంజనేయులు, వైస్ ఎంపీపీ అరుణ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు దిలావర్‌బాషా, ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్, ఆర్‌సీ జయన్న, కెంచానపల్లి బొజ్జి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు నాగేంద్ర, రామాంజనేయులు, శంకర్, లక్ష్మీనారాయణ, గొల్ల మురారీ, రుద్రముణి, ముక్కన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను నిరూపిస్తాం.. సిద్ధమా?

రాయదుర్గంటౌన్: ప్రజాక్షేత్రంలో చంద్రబాబు మోసాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే నిరూపిస్తారు. తాగుబోతు చిల్లర టీడీపీ నాయకులు అందుకు సిద్ధమా అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సవాల్ విసిరారు. 31, 32 వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు చేపట్టిన 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని కొందరు టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్న తీరును తీవ్రంగా ఎండగట్టారు. బుధవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజలతో మమేకమై ప్రజల కష్టాలు, వారి ఇబ్బందులు తెలుసుకోవడం తమ బాధ్యతన్నారు. ప్రశాంతమైన రాయదుర్గంలో టీడీపీ చిల్లర నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని అడ్డుకొని రభస చేయడం విచారకరమన్నారు. దమ్ముంటే టీడీపీ కార్యకర్తలు తమతో పాటు కలిసి ఇంటింటికీ వెళ్దాం.. పథకాలు అర్హులకు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకుందని సవాల్ విసిరారు. ప్రజలు నిలదీస్తే ఎవరు పారిపోతారో, ఎవరు ఉంటారో అని తెలుస్తుందని చురకలంటించారు.

ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం తీవ్రతరం

ఉరవకొండ: విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను కూటమి ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కో చైర్మన్లు మల్లెల శ్రీనివాస్, జితేంద్ర హెచ్చరించారు. బుధవారం స్థానిక విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ప్రధాన ముఖద్వారం వద్ద రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగు డీఏలను వెంటనే విడుదల చేసి, కారుణ్య నియామకాలు చేపట్టాన్నారు. దీర్ఘకాలిక సర్వీసున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ విద్యుత్ సంస్థలలో విలీనం చేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించని పక్షంలో రిలే దీక్షలు చేపడుతామని, అనంతరం నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు.

రిటైర్డ్ అధికారితో రంగయ్య సమావేశం



రిటైర్డ్ వ్యవసాయాధికారి వీరయ్యచౌదరితో మట్లాడుతున్న రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: సుదీర్ఘ కాలం వ్యవసాయ శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన పట్టణానికి చెందిన వీరయ్య చౌదరితో ఆయన ఇంట్లో బుధవారం వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య సమావేశమయ్యారు. రైతుల సమస్యలు, నీటిపారుదల రంగాలపై చర్చించారు. కళ్యాణదుర్గం నియోజవర్గంలోని సాగు, తాగునీటి రంగ దుస్థితి, సమస్యలపై శాశ్వత పరిష్కారం దిశగా అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు పాల్గొన్నారు.

బీటీపీ కాలువ పనుల పరిశీలన



దుద్దేకుంట వద్ద పనులను పరిశీలిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని బెళుగుప్ప మండలం దుద్దేకుంట గ్రామ సమీపంలో జరుగుతున్న బీటీపీ కాలువ పనులను వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్ ఛీఫ్ ఇంజనీర్ కె.నాగరాజ, హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్–2 ఎస్ఈ ఎ.రాజస్వరూపకుమార్, డీఈఈలు బి.వెంకటేశులు శెట్టి, వెంకటనారాయణ, ఏఈఈ పి.సుదర్శన్ బుధవారం పరిశీలించారు. కాలువ పనుల నాణ్యత, కాలువల విస్తీర్ణం తదితర విషయాలపై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

అండేపల్లిలో మారెమ్మ జాతర



మాజీ ఎంపీ తలారి రంగయ్య, తిప్పేస్వామిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కళ్యాణదుర్గం (కంబదూరు): అండేపల్లి గ్రామంలో బుధవారం మారెమ్మ జాతర ఘనంగా జరిగింది. మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నారాయణపురం వెంకటేశులు, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షులు బొమ్మయ్య, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, పట్టణ కన్వీనర్ వెంకటప్ప, ఎంపీపీ భీమేష్‌లతో కలిసి జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాజీ ఎంపీ, తిప్పేస్వామిని దుశ్శాలువాలతో సత్కరించి విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు ములకనూరు తిమ్మరాయుడు, బొమ్మయ్య, నీలకంఠరప్ప, ఎంపీటీసీలు మల్లేశు, మీ సేవ కుమార్, స్థానిక నాయకులు రామాంజనేయులు, తలారి రమేష్, గులిగానప్ప,బాలరాజు, అమర్, హరి, వెంకటేశులు, హనుమంతరాయుడు, మల్లూరి వెంకటేశులు, రవి, భాస్కర్, పాతలింగ, రామాంజినేయులు, ప్రతాప్, కిరణ్, మురళి, దాదులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకోండి

కూడేరు: కూడేరు మండలంలో పేద విద్యార్థులకు అందాల్సిన పాఠ్య పుస్తకాలను పక్కదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం అనంతపురంలో జిల్లా విద్యాధికారి ప్రసాద్‌కు వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డిలు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఈ నెల 15న సాక్షి దినపత్రికలో కథనం కూడా వచ్చిందని డీఈఓకి వివరించారు. స్పందించిన డీఈఓ పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.